నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి

13 హైదరాబాద్, గురువారం 7 మార్చి 2024 YADADRI BHUVANAGIRI

# రామలింగేశ్వరాలయంలో వైభవంగా ధ్వజ పటారోహణం

## నేడు స్వామివారి కల్యాణం



మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ధ్వజపటారోహణం నిర్వహిస్తున్న శివాలయం ప్రధానార్చకుడు నరసింహరాములుశర్మ.

యాదగిరిగుట్ట, మార్చి6 : యాదగిరిగుట్టలోని పర్వత వర్ధినీ రామలింగేశ్వరస్వామి ప్రధానాలయంలో మహాశివ రాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు బుధవారం ఆలయంలో ధ్వజ పటారోహణం, భేరీపూజ, దేవతాహ్వానం, అగ్నిప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం నిత్యహవనం, శివపంచాక్షరీ జపం, నందీశ్వర పారాయణాలు, పంచసూక్త పఠనం, మూల మంత్ర జపములు పఠించారు. ధ్వజ పటారోహణ కార్యక్రమంలో భాగంగా కొత్త వస్త్రం మీద పరమశివుని వాహనమైన నందీశ్వరుని, అష్ట మంగళ చిత్రాలను చిత్రీకరించి, అర్చించి ధ్వజస్తంభంపై అలంకరించారు. సకల దేవతలకు ఆహ్వాన సూచకంగా ధ్వజమును ఎగురవేశారు.

నాట్యప్రియుడు, శబ్ద బ్రహ్మ అయిన పరమేశ్వరుడికి అత్యంత ప్రీతిని కలిగించే భేరీపూజ చేపట్టారు. డోలు వాయిద్యానికి పూజాధికాలు నిర్వహించి, నాదస్వరముపై ఆయా రాగ ఆలాపనలతో సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. ఉత్సవాలకు వేంచేసిన సకలదేవతలకు అగ్నిముఖంగా పంచసూక్త హవనములు, మూలమంత్ర, మూర్తిమంత్ర, జపములతో దశాంగ తర్పణాదులు, స్మార్తాగమరీత్యా అగ్ని ప్రతిష్ఠ కార్యక్రమం సాగింది.

### కుంభార్చనలు.. వేద పారాయణాలు

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం శివాలయంలో పారాయణికులతో స్తోత్ర కుంభార్చనలు, వేద పారాయణాలు, నమక చమక మంత్రపుష్ప పఠనములు, సోమ కుంభార్చనలు, మూలమంత్ర పారాయణాలు యాథావిధిగా నిర్వహించారు. అనంతరం లఘు పూర్ణాహుతి కార్యక్రమం శాస్త్రోక్తంగా చేపట్టారు. ఈ వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, శివాలయ ప్రధాన అర్చకులు నరసింహరాములు శర్మ, ప్రధాన పురోహితులు గౌరిభట్ల సత్యనారాయణ శర్మ, డీఈఓ దోర్బల భాస్కర్ శర్మ, ఏఈఓ రఘు, పర్యవేక్షకులు చంద్రమౌళి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

### నేడు రామలింగేశ్వరుడి కల్యాణం

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రామలింగేశ్వరాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు రుద్రహవనం, రాత్రి 7.00 గంటలకు రామలింగేశ్వరుడి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు.

# విశిష్ట సేవా పురస్కారాలకు దరఖాస్తులు

రామగిరి, మార్చి 6 : ప్రపంచ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఉమ్మడి నల్లగొండ జిల్లాతోపాటు రాష్ట్రంలో వివిధ రంగాల్లో సేవలందించే విశ్వబ్రాహ్మణ మహిళలకు 'విశిష్ట సేవా పురస్కారం – 2024' అందించేందుకు అర్హులైన మహిళా ఉద్యోగుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసోజు శ్రీనివాస్, పెందోట సోము, ప్రచార కార్యదర్శి బొడ్డుపల్లి రామకృష్ణ బుధవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. విద్య, వైద్యం, పోలీసు, రవాణా, న్యాయ శాఖ, స్త్రీ శిశు సంక్షేమ, మున్సిపల్, పంచాయతీ రాజ్, సామాజిక సేవ, సాహిత్యం, కళారంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విశ్వబ్రాహ్మణ మహిళలు తమ పూర్తి బయోడేటాతో పాస్‌పోర్టు సైజు ఫొటో, ఫోన్ నెంబర్, ఇతర వివరాలను జతచేస్తూ దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 20లోపు సమర్పించాలని సూచించారు. ఎంపికైన వారికి ఈ నెల 24న నల్లగొండలోని విశ్వకర్మ భవనంలో విశిష్ట సేవా పురస్కారాలు అందజేస్తామని తెలిపారు. వివరాలకు 9490493499, 9885056185, 9441464552 లలో సంప్రదించాలని సూచించారు.

# ఎల్‌ఆర్‌ఎస్‌పై కదం తొక్కిన బీఆర్‌ఎస్

## కాంగ్రెస్ నేతలు మాట తప్పొద్దంటూ నిరసనలు

**ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్)పై కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరి పట్ల బీఆర్‌ఎస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్ నేతలు, ఇప్పుడు అధికారంలోకి రాగానే చార్జీలు ఎలా వసూలు చేస్తారంటూ ఆందోళనలకు దిగింది. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన మేరకు ఉచితంగానే ఎల్‌ఆర్‌ఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజక వర్గ కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించింది. కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత వైఖరిని నిలదీస్తూ పెద్దసంఖ్యలో ఆ పార్టీ శ్రేణులు ఆందోళనల్లో కదం తొక్కాయి.**



భువనగిరి పట్టణంలోని బాబు జగ్జీవన్‌రామ్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, నాయకులు

- అప్పుడో మాట.. ఇప్పుడో మాట ఏంటంటూ నిలదీత
- ఉచితంగా అమలు చేసే వరకు పోరాటం
- అన్ని నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ ధర్నాలు
- నేడు కలెక్టర్లు, ఆర్డీఓలకు విజ్ఞాపనలు

నల్లగొండ ప్రతినిధి, మార్చి6(నమస్తే తెలంగాణ) : ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులను కాంగ్రెస్ సర్కార్ మోసం చేయడంపై బీఆర్‌ఎస్ పార్టీ మండిపడుతున్నది. బుధవారం జిల్లా అంతటా ధర్నాలు చేపట్టింది. నల్లగొండ జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నాయి. జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొనగా పార్టీ ముఖ్య నేతలంతా తరలివచ్చారు. దేవరకొండలో బస్టాండ్ వద్ద పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా జరిగింది. నియోజకవర్గ ముఖ్యనేతలు, ప్రజాప్రతినిధులంతా తరలివచ్చారు. మిర్యాలగూడలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత వైఖరికి వ్యతిరేకంగా నినదించారు. మునుగోడులో మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. మెయిన్ రోడ్డుపై బైఠాయించి ఉచితంగా ఎల్‌ఆర్‌ఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాల్వాయి స్రవంతి, పార్టీ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సూర్యాపేటలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ నేతృత్వంలో జరిగిన ఆందోళనలో పెద్ద సంఖ్యలో పార్టీ నేతలు, కార్యకర్తలు భాగస్వాములయ్యారు. కోదాడలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించి ఖమ్మం క్రాస్‌రోడ్డులో ధర్నా చేపట్టారు. హుజూర్‌నగర్, తుంగతుర్తిలోనూ పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఎల్‌ఆర్‌ఎస్ చార్జీలను నిరసిస్తూ పెద్ద సంఖ్యలో కదం తొక్కారు. యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆలేరు తాసీల్దార్ కార్యాలయం ఎదుట మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాలుపంచుకున్నాయి. ఎల్‌ఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ సర్కార్ ప్రజలను మోసం చేస్తున్నదని, గతంలో వాళ్లు చెప్పిన మాదిరిగానే ఉచితంగానే ఎల్‌ఆర్‌ఎస్‌ను అమలు చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ నేతలు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఉచితంగా అమలు చేసే వరకు ప్రజల పక్షాన బీఆర్‌ఎస్ పోరాటం కొనసాగిస్తుందని హెచ్చరించారు. ఇక గురువారం జిల్లా కలెక్టర్లు, ఆర్డీఓలకు ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలంటూ డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ నేతలు వినతిపత్రాలు అందజేయనున్నారు.




యాదగిరిగుట్ట: ఆలేరు తాసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు



భువనగిరిలో స్వర్ణగిరి ఆలయంలో స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

# స్వర్ణగిరిలో వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

- త్రిదండి చినజీయర్‌స్వామి నేతృత్వంలో నిర్వహణ
- పూజల్లో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి, ప్రభుత్వ విప్, జడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్, మార్చి 6 : పట్టణంలోని మానేపల్లి హిల్స్‌పై మానేపల్లి జ్యువెల్లర్స్ ఆధ్వర్యంలో నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో త్రిదండి చినజీయర్‌స్వామి నేతృత్వంలో బుధవారం స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితుల మంత్రోచ్ఛరణలు, హోమాది క్రతువులతో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం వేలాది మంది భక్తుల నడుమ చేపట్టారు. వారం రోజుల నుంచి వేద బ్రాహ్మణులు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠాపనలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యే కుంభం అనీల్‌కుమార్ రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

# చేనేత కళాకారుల నైపుణ్యం అద్భుతం

- కొలంబియా పర్యాటకులు



భూదాన్ పోచంపల్లిలో కళ పునర్వి హ్యాండ్లూమ్‌లో చేనేత చిటికీని పరిశీలిస్తున్న విదేశీ పర్యాటకులు

భూదాన్ పోచంపల్లి,మార్చి 6 : సాంప్రదాయ చేనేత వృత్తిలో కళాకారుల నైపుణ్యం అద్భుతమని కొలంబియా పర్యాటకులు కొనియాడారు. పోచంపల్లి పట్టణంలోని కళ పునర్వి హ్యాండ్లూమ్ యూనిట్‌ను కొలంబియా దేశంలోని వల్గర్ అండ్ గ్రూప్‌కు చెందిన 9మంది సభ్యుల బృందం బుధవారం సందర్శించింది. ఈ సందర్భంగా చేనేత సహకార సంఘంతోపాటు ప్రైవేట్ చేనేత వస్త్ర దుకాణాల సముదాయాలను సందర్శించి చేనేత వస్త్రాలను తిలకించారు. గ్రామీణ పర్యాటక కేంద్రమైన టూరిజం పార్కులో ఆచార్య వినోభాబావే, వెదిరె రామచంద్రారెడ్డి కాంస్య విగ్రహాలను తిలకించారు. అనంతరం చేనేత కార్మికుల గృహాలకు వెళ్లి వస్త్రాల తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. రంగుల అద్దకం, చీరెల తయారీ, మార్కెటింగ్ విధానం, ప్రభుత్వం చేయూత, చేనేత కార్మికుల జీవన స్థితిగతుల గురించి తెలుసుకున్నారు. చేనేత వృత్తికి కళాకారులు జీవం పోస్తున్నారని, సాంప్రదాయ వృత్తి పరిరక్షణకు ప్రతిఒక్కరూ బాధ్యతగా పనిచేస్తున్నారని అన్నారు. ఈ బృందానికి టూరిస్ట్ గైడ్ మధు మార్గదర్శనం చేశారు.

# యాదగిరిగుట్ట వార్షిక బ్రహ్మోత్సవాలను పకడ్బందీగా నిర్వహించాలి

- భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలి
- కలెక్టర్ హనుమంతు కె.జెండగే



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, మార్చి 6 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై బుధవారం సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి 21 వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మంచినీటి సరఫరా పెంచాలని, ముఖ్యంగా 17, 18, 19 తేదీల్లో ఎక్కువ సరఫరా చేయాలని సూచించారు. గ్రామపంచాయతీ, మున్సిపాలిటీల నుంచి అదనపు సిబ్బందిని నియమించుకొని పుణ్యక్షేత్రంలో పారిశుధ్య చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల రోజుల్లో బస్సుల సంఖ్య పెంచాలని, అన్ని మండల కేంద్రాల నుంచి బస్సులు నడుపాలని అన్నారు. స్వామివారి కల్యాణం జరిగే 18వ తేదీ రాత్రి బస్సులను అధిక సంఖ్యలో నడుపాలని, ఉప్పల్, చెంగిచెర్ల డిపోల సహకారంతో అదనపు బస్సులను ఏర్పాటు చేసుకోవాలని ఆర్టీసీ డిపో మేనేజర్‌ను ఆదేశించారు. యాదగిరిగుట్ట పట్టణంలో, గుట్ట పైన ఫైరింజిన్, 104, 108 అంబులెన్స్ సర్వీసులను అందుబాటులో ఉంచాలని, గుట్టపైన, కింద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, అత్యవసర మందులను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రొటోకాల్ ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని, అన్ని వాహనాలను గుట్టపైకి అనుమతించకుండా, భక్తులు బస్సులను సద్వినియోగం చేసుకునేలా చూడాలని అన్నారు. గుట్టపైకి అనుమతించే ఆటోల్లో సామర్థ్యానికి మించి భక్తులను ఎక్కించుకోకుండా ఆదేశాలు జారీ చేయాలని రవాణా అధికారికి సూచించారు. బ్రహ్మోత్సవాలు జరిగే రోజుల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చూడాలని, ఏదైనా అంతరాయం ఏర్పడితే మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు, జనరేటర్ అందుబాటులో ఉంచుకోవాలని విద్యుత్ శాఖకు సూచించారు. డిప్యూటీ పోలీస్ కమిషనర్ రాజేశ్‌చంద్ర మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో బందోబస్తు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, ప్రముఖుల సెక్యూరిటీ తదితర ఏర్పాట్లను పటిష్టంగా చేపడుతామని చెప్పారు. సమావేశంలో భువనగిరి ఆర్డీఓ అమరేందర్, ఆలయ ఈఓ రామకృష్ణారావు, అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ రమేశ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ అజయ్‌కుమార్‌రెడ్డి, తాసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, వాటర్ గ్రిడ్ ఇంజినీర్ అరుణారాథోడ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

### బ్రహ్మోత్సవాలకు అదనపు భద్రత

- రాచకొండ సీపీ తరుణ్ జోషి

యాదగిరిగుట్ట : ఈ నెల 11 నుంచి ప్రారంభమయ్యే యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా అదనపు భద్రతను ఏర్పాటు చేయనున్నట్లు రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి అన్నారు. బుధవారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే ఎదుర్కోలు, కల్యాణోత్సవం ప్రాంతాలు, శ్రీవారి మెట్ల మార్గం, మొదటి, ఎంట్రీ ఫ్లై ఓవర్, మాఢవీధులు పరిశీలించారు. అనంతరం యాదగిరిగుట్ట పోలీస్‌స్టేషన్ సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీసీపీ రాజేశ్‌చంద్ర, ఏసీపీ రమేశ్‌కుమార్, యాదగిరిగుట్ట దేవస్థాన ఏసీపీ సైదులు, పట్టణ సీఐ రమేశ్, ఎస్ఐ ఉదయ్, చంద్రశేఖర్, ఆలయ పర్యవేక్షకులు రాజన్‌బాబు ఉన్నారు.

# ట్రిపుల్ ఆర్‌పై మాట మార్చిన మంత్రి

'ట్రిపుల్ ఆర్ తెలంగాణకు మణిహారం. దీని ద్వారా పరిశ్రమలు వస్తాయి. రీజినల్ రింగ్ రోడ్డు రాయగిరి అలైన్‌మెంట్ మార్చేందుకు ప్రయత్నిస్తున్నాం. త్వరలోనే మళ్లీ సర్వే చేయిస్తాం. అర్బన్, సెమీ అర్బన్, రూరల్ నిబంధనల ప్రకారం చేపడుతాం. సూటబుల్ పరిహారం అందిస్తాం. దీనిపై వారం తర్వాత నిర్ణయం తీసుకుంటాం' ఇవీ జనవరి 21న కలెక్టరేట్‌లో సమీక్ష అనంతరం మీడియా సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు.

'ట్రిపుల్ ఆర్ రాయగిరి అలైన్‌మెంట్ మారుతుందా.. మారదా.. ఏడికి పోతుందనేది చెప్పం. తప్పకుండా ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూస్తాం. రైతులకు న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తాం. అవసరమైన చోట్ల మార్పులు చేర్పులపై చర్చిస్తాం. ట్రిపుల్ ఆర్‌తో తెలంగాణ అభివృద్ధి చెందుతుంది' బుధవారం ప్రెస్‌మీట్‌లో మంత్రి చేసిన కామెంట్స్.

- జనవరిలో అలైన్‌మెంట్ మారుస్తామన్న కోమటిరెడ్డి
- తాజాగా రాయగిరి అంశంపై దాటవేత
- గతంలో అనేక సందర్భాల్లో కాంగ్రెస్ హామీ
- ఇప్పుడు పరిహారం పెంచేందుకు ప్రయత్నిస్తామని హామీ
- ఆందోళనలో రాయగిరి ట్రిపుల్ ఆర్ రైతులు



భువనగిరిలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పక్కన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే మందుల సామేల్

యాదాద్రి భువనగిరి, మార్చి 6 (నమస్తే తెలంగాణ) : రీజినల్ రింగ్ రోడ్డుకు సంబంధించి రాయగిరి అలైన్‌మెంట్ మార్పుపై రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాటమార్చారు. అలైన్‌మెంట్ మార్పుపై జనవరిలో చెప్పిన మాటలకు పొంతన లేకుండా వ్యాఖ్యలు చేశారు. పరిహారం పెంచేందుకు ప్రయత్నం చేస్తామంటూ తప్పించుకున్నారు. దీంతో రాయగిరి రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొన్నటి దాకా మారుస్తామని ఇప్పుడు తప్పించుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ట్రిపుల్ ఆర్ స్వరూపం ఇలా..

ట్రిపుల్ ఆర్ ప్రాజెక్ట్‌లో భాగంగా సంగారెడ్డి జిల్లాలోని గిర్మాపూర్ నుంచి మెదక్, సిద్దిపేట జిల్లాల మీదుగా యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ వరకు హైదరాబాద్ ఉత్తర భాగంలో తొలి విడుతలో రీజినల్ రోడ్డు నిర్మించనున్నారు. 159 కిలోమీటర్ల మేర 100 మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మించాలని ప్రతిపాదించారు. జిల్లాలోని చౌటుప్పల్, వలిగొండ, భువనగిరి, యాదగిరిగుట్ట, తుర్కపల్లి మండలాల పరిధిలోని 34 రెవెన్యూ గ్రామాల్లో భూసేకరణ చేపట్టనున్నారు. ఇప్పటికే త్రీడీ నోటిఫికేషన్ కూడా జారీ చేశారు. త్వరలో త్రీజీ నోటిఫికేషన్ కోసం అధికారులు కసరత్తు చేస్తున్నారు.

### మోసం చేసిన కాంగ్రెస్

ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పు కోసం రాయగిరి రైతులు అనే విధాలుగా ఉద్యమాలు చేశారు. నాడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ రైతులను రాజకీయంగా వాడుకునే ప్రయత్నం చేసింది. అనేక సార్లు ఉద్యమానికి ఆ పార్టీ నేతలు మద్దతు పలికారు. అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మార్పిస్తామని హామీ ఇచ్చారు. ఏకంగా కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి తమ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే అలైన్‌మెంట్ మార్పిస్తామని బహిరంగంగా ఎన్నికల ప్రచారంలో ప్రకటించారు. అనేక సందర్భాల్లో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మద్దతుగా నిలిచి మార్చాలని డిమాండ్ చేశారు. నాడు భువనగిరి ఎంపీగా ఉన్న ప్రస్తుత మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఏకంగా ధర్నాలో పాల్గొన్నారు. కానీ తీరా అధికారంలోకి వచ్చాక రైతులను పట్టించుకోవడమే మానేశారు.

### రెండు నెలల్లోనే మంత్రి యూటర్న్..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మంత్రి పదవి చేపట్టిన కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తొలిసారి జిల్లాకు విచ్చేసిన సందర్భంగా జనవరి 21న కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియా సమావేశంలో ట్రిపుల్ ఆర్‌పై మాట్లాడారు. రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారని, అలైన్‌మెంట్ మార్పునకు చర్యలు తీసుకుంటామని, త్వరలోనే మళ్లీ సర్వే చేయిస్తామని ప్రకటించారు. మంత్రి చెప్పి నెలన్నర దాటినా ఇప్పటి వరకు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తాజాగా బుధవారం భువనగిరి వచ్చిన మంత్రి ఈ సారి యూటర్న్ తీసుకోవడం విశేషం. అసలు అలైన్‌మెంట్ మార్పు గురించి మేం చెప్పం.. అంటూ దాటవేశారు. దాంతో అక్కడున్న విలేకర్లు ముక్కున వేలేసుకున్నంత పనైంది.

### ఆందోళనలో రైతులు..

కాంగ్రెస్ పార్టీ తమను నమ్మించి మోసం చేసిందని రాయగిరి రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలైన్‌మెంట్ మారుస్తామని హామీ ఇచ్చి.. ఇప్పుడు పరిహారం పెంచుతామనడం ఏంటని మండిపడుతున్నారు. ఇప్పటికే మూడు దఫాలుగా భూములను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ నాయకులను నమ్మితే తడిగుట్టతో గొంతు కోస్తున్నారని వాపోతున్నారు. కోర్టులోనే బలంగా కొట్లాడుదామని, మరోదఫా ఉద్యమానికి నాంది పలుకాలని రైతులు భావిస్తున్నారు.